www.prajasakti.com


ప్రజాశక్తి

మంగళవారం 18 జూన్ 2024



నీటి ప్రవాహానికి అడ్డంకిగా తూడు, గుర్రపు డెక్క

ఆందోళనలో రైతులు



ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని దాదాపు అన్ని పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క మొక్కలు పెరిగి పోవడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయని ఈ ప్రాంతంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఉపాధి హామీ పనులు జరిగి, పొలాలకు నీరు అందే కాల్వలు శుభ్రం చేసినా ప్రధాన కాలువల్లో పరిస్థితి దయనీయంగా ఉందని వారన్నారు. దీనివల్ల పొలాల్లో దమ్ము చేసుకోవడానికి నీరు అందక ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని, పొలాలకు నీరు అందేలా ప్రధాన కాల్వల్లో అడ్డంకులు తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



'పోలవరం'ను దెబ్బతీశారు

ప్రాజెక్టు ప్రాంతంలో సిఎం చంద్రబాబు విస్తృత పర్యటన - దెబ్బతిన్న డయాఫ్రం వాల్, కాపర్‌డ్యామ్, గైడ్‌బండ్ పనుల పరిశీలన

పోలవరం పూర్తి చేయాలంటే మరో నాలుగు సీజన్లు - అదనంగా మరో రూ. మూడు వేల కోట్లకుపైగా భారం

గత ప్రభుత్వ అధినేత రాష్ట్రానికి శాపంగా మారారు : సిఎం చంద్రబాబునాయుడు

నిర్వాసితుల సమస్యలపై సిఎంకు సిపిఎం బృందం వినతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

రాజకీయాల్లో ఉండకూడని వ్యక్తి వచ్చి రాష్ట్రానికి శాపంగా మారారని, రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టును దెబ్బతీయడమే అందుకు నిదర్శనమని సిఎం చంద్రబాబు అన్నారు. సిఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తన తొలిపర్యటనగా చంద్రబాబు సోమవారం పోలవరం విచ్చేశారు. ఉదయం 11.55 గంటలకు హెలీకాప్టర్‌లో పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా ఏరియల్ సర్వే ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం హెలీప్యాడ్‌కు చేరుకున్న సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు, అధికారులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున తరలొచ్చారు. అనంతరం కొండపై ఉన్న వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించారు. అక్కడ నుంచి బస్సుపై రోడ్డుమార్గం గుండా ప్రాజెక్టు పనులు పరిశీలించారు. ముందుగా స్పిల్‌వే ప్రాంతంలో రెండు చోట్ల, ఎగువ, దిగువ కాపర్‌డ్యామ్‌ల పనులు, దెబ్బతిన్న డయాఫ్రంవాల్, పవర్‌స్టేషన్ పనులను సిఎం పరిశీలించారు. ఆయన పరిశీలించిన ప్రతి పాయింట్ వద్దా పనుల ప్రగతికి సంబంధించి అధికారులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పనుల తీరును సిఎంకు వివరించారు. దాదాపు గంటన్నరపాటు మండుటెండలో సిఎం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. రెండు గంటలకు కొండపైకి చేరుకుని మధ్యాహ్న భోజన అనంతరం ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఈ విధంగా దెబ్బతింటే గత ప్రభుత్వానికి మీరు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. దీంతో



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న చంద్రబాబు


తాము అప్పట్లో లేమంటూ చాలా మంది అధికారులు సమాధానం చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితి ఏమిటీ, ఎలా ముందుకెళ్లాలి, దెబ్బతిన్న పనులు పూర్తి చేయడానికి ఎంతకాలం పడుతుందని అధికారులను సిఎం ప్రశ్నించినట్లు సమాచారం. దెబ్బతిన్న పనులు పూర్తి చేయాలంటే నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు చెప్పినట్లు తెలిసింది. దీనిపై మరింత పరిశీలన చేయాలంటూ చంద్రబాబు సూచించినట్లు సమాచారం. అనంతరం విలేకరుల సమావేశంలో సిఎం మాట్లాడారు.




వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును తిలకిస్తున్న చంద్రబాబు

ప్రాజెక్టును చూస్తే బాధ వస్తోంది..!

చైనాలోని త్రీగోర్జెస్ కన్నా పోలవరం ప్రాజెక్టు అధికస్థాయిలో నీటి విడుదల సామర్థ్యం గలదని, అయితే ప్రస్తుతం ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ వస్తుందని సిఎం చంద్రబాబు అన్నారు. 194 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం, 320 టిఎంసిల వరకు వరద నీటిని వినియోగించుకోగలిగే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేశానన్నారు. పోలవరం ప్రాజెక్టుపై వందకుపైగా సమీక్షలు, 31 సార్లు క్షేత్రస్థాయిలో ప్రాజెక్ట్ పనులను పరిశీలన చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతానికి పైగా పనులు పూర్తి చేశామన్నారు. అదే వేగంతో పనులు పూర్తి చేసి ఉంటే 2020 చివరి నాటికే పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యి ఉండేదన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానంలో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్‌కు రూ.7,100 కోట్లకు కేటాయింపులు తగ్గించి, అదీ కాంట్రాక్టర్లకు అడ్వాన్సులుగా చెల్లించారన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించామని, గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయనీయకుండా కాంట్రాక్టర్‌ను మార్చడం, అప్పటివరకు పని చేసిన ఇంజినీరింగ్ సిబ్బంది అందరినీ మార్చివేశారన్నారు. కాంట్రాక్టర్‌ను, ఇంజినీరింగ్ అధికారులను మార్చొద్దని కేంద్ర జలసంఘం అధికారులు చెప్పినప్పటికీ గత ప్రభుత్వం వినలేదన్నారు. 2019, 2020లో వచ్చిన అధిక వర్షాల కారణంగా డయాఫ్రమ్ వాల్ నాలుగుచోట్ల 35 శాతం దెబ్బతిందన్నారు. డయాఫ్రమ్ వాల్ మరమ్మతుకు రూ.447 కోట్లు ఖర్చవుతాయని, అయినప్పటికీ పూర్తిగా మరమ్మతు అవుతుందని నమ్మకం లేదని అన్నారు. డయాఫ్రమ్ వాల్ సమాంతరంగా కొత్తది నిర్మించాలంటే రూ.996 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారన్నారు. కాపర్‌డ్యామ్ గ్యాప్ పనులు పూర్తి చేయాలంటే మరో రూ.రెండు వేల కోట్లు అవ్వొచ్చన్నారు. దీనికోసం నాలుగు సీజన్లు అంటే నాలుగేళ్ల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారన్నారు. రూ.వేల కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలు పోలవరం ప్రాజెక్ట్ పాలిట శాపాలుగా మారాయన్నారు. పనులను ఎంత సంక్లిష్టం చేయాలో అంతా చేసి ప్రాజెక్ట్‌ను పనికిరాకుండా చేశారన్నారు. ఇది క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎంఎల్‌ఎలు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, సొంగా రోషన్‌కుమార్, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, వసంత కృష్ణ ప్రసాద్, నిమ్మకాయల చినరాజప్ప, బొలిశెట్టి శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలికిన పితాని సత్యనారాయణ



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజా ఫిర్యాదుల స్వీకరణెప్పుడో..!

ఎన్నికల కోడ్ పేరిట నిలిచిన 'స్పందన' - కోడ్ తొలగినా ప్రారంభం కాని వైనం

వచ్చే సోమవారమైనా ప్రారంభమయ్యేనా అని జనం ఎదురుచూపు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి సోమవారం గ్రామ సచివాలయం, మండల కేంద్రం, డివిజన్ కేంద్రం, కలెక్టరేట్ ఇలా పలుచోట్ల సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించేవారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించేవారు. మరికొన్నింటిని నిర్ణీత గడువులో పరిష్కరించేవారు. పోలీసు శాఖలోనూ ఇదేవిధంగా కింద నుంచి జిల్లాస్థాయి వరకు ఫిర్యాదులు స్వీకరించేవారు. దీంతో ఆయా కార్యాలయాలకు జనం క్యూ కట్టేవారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎలాగున్నా మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జనం బారులు తీరేవారు. సమస్యల పరిష్కార స్థాయి ఎలాగున్నా తమ సమస్య అధికారులకు చెప్పుకున్నామన్న సంతృప్తి అర్జీదారుల్లో ఉండేది.

అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి 11 తర్వాత స్పందన కార్యక్రమం రద్దు చేశారు. మార్చి 16 నుండి జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సంగతి తెలిసిందే. కొత్త ప్రభుత్వం జూన్ 12న ప్రమాణస్వీకారం చేసింది. దీంతో జూన్ 10న అర్జీల స్వీకరణ చేపట్టలేదు. జూన్ 17న బక్రీద్ సెలవు కావడంతో ఇప్పటికీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం కాలేదు. అయితే ఇవేమీ తెలియని అర్జీదారులు ఎన్నికలైపోయాయిగా అంటూ అర్జీలిచ్చేందుకు ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది అధికారులు సైతం ఇప్పటి వరకూ అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా పొలాల సర్వే చేపట్టాలని, అర్హులైన తమకు ప్రభుత్వ పథకాలు రావడం లేదని, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలని, స్థానిక సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందేవి.

ప్రభుత్వం మారినప్పుడల్లా ఈ కార్యక్రమం పేరు, విధి విధానాలు మారుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజావాణిగా, 2014 నుంచి 2019 వరకూ టిడిపి ప్రభుత్వంలో 'మీ కోసం', 2019 నుంచి స్పందన కార్యక్రమంగా పిలిచారు. పేరు మారినా కొన్ని సమస్యలు మాత్రం అపరిష్కృతంగానే ఉంటున్నాయనేది వాస్తవం. తాజాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా ప్రభుత్వం పేరు మార్చింది. అత్యంత కీలకమైన అర్జీల స్వీకరణ కార్యక్రమం వచ్చే సోమవారం నుంచైనా ప్రారంభమవుతుందో లేదో వేచిచూడాలి.

నిప్పుల వర్షం.. ఉక్కిరిబిక్కిరవుతున్న జనం

ప్రజాశక్తి - ఆచంట



నిర్మానుష్యంగా ఆచంటలోని ప్రధాన రహదారి


రెండు రోజులుగా భానుడు నిప్పులు చెరుగుతుండటంతో వేడిమి తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎక్కువగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. సూరీడు ధాటికి తట్టుకోలేక ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ఆర్అండ్‌బి ప్రధాన రహదారులు, కరెంట్ సెంటర్ వెలవెలబోతున్నాయి. తీవ్రమైన ఉక్కపోత ఉండటంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృగశిర కార్తెలోనూ ఎండలు విపరీతంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెల సగం రోజులు గడిచిపోయిన వరుణుడు మాత్రం ముఖం చాటేస్తూ దోబూచులాడుతుండటం అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా సార్వా పనులు ముందుకు సాగని దుస్థితి ఏర్పడింది. సాయంత్రం వేళల్లో కొన్నిచోట్ల చెదురుమదురు జల్లులు పడుతున్నా పగటి వేళల్లో ఎండ తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు.

నూతన ప్రభుత్వం కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - తణుకు

కల్లుగీత కార్మికులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండేలా 1991లో పోరాడి సాధించుకున్న కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, నిధులు కేటాయించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక అమరవీరుల భవనంలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అక్రమ మద్యం ఆదాయం కోసం గీతవృత్తిని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. 2014లో ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు ఏఒక్కటీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త విధానాలతో లక్షలాది మంది గీత కార్మికుల ఉపాధిని దెబ్బ తీశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

రవీంద్ర చొరవ చేసి కల్లుగీత వృత్తిని కాపాడాలని కోరారు. కల్లు కేన్సర్, డయేరియా, పొంగు వంటి వ్యాధులకు ఔషధంలా పనిచేసే గుణాలతో ఉంటుందని, ఆరోగ్యవంతమైన పోషకాలు అనేకం ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారని గుర్తు చేశారు. అటువంటి ఆరోగ్యకరమైన కల్లును రక్షించాలని కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గీతవృత్తిని ఆధునికీకరించి ప్రోత్సహించాలని, లక్షలాది గీతన్నల కుటుంబాలకు సామాజిక భద్రత, ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ బోగస్ కుల కార్పొరేషన్లను తక్షణం రద్దు చేసి గీత కార్మికులందరికీ గతంలో ఉన్న విధంగా ఒకే కార్పొరేషన్‌ను కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఆదరణ పథకం పునరుద్ధరించి గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు, ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీగా ఉండే మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పిల్లి ఏడుకొండలు, దొంగ సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, చింతపల్లి చిన్నవీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు



కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో ఉపాధి పని ప్రాంతాలను ఆయన పర్యటించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పేదలకు 100 రోజులు పని దినాలు కల్పించాలని ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అధికారులు పని కల్పించలేదన్నారు. అంతేకాకుండా తెల్లవారుజాము నాలుగు గంటలకే పనికి తీసుకువచ్చి 9 గంటల వరకూ చేయిస్తున్నారని, వారం రోజులు పని చేస్తే కనీసం వెయ్యి రూపాయలు కూడా రావట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు పని సమయంలో కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వకపోవడం దారుణం అన్నారు. అంతేకాకుండా పనికి వారు తెచ్చుకునే పనిముట్లకు సైతం నగదు చెల్లించాలని, అవేమీ పట్టించుకోకుండా అధికార యంత్రాంగం కూలీలను పనిచేసే యంత్రాల్లా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి హామీ చట్ట ప్రకారం ఏ నిబంధనలు ఉన్నాయో వాటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రీయ, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

పల్లె గొంతెండుతోంది..!

తాగునీటి సమస్య తీవ్రం

చెరువుల్లో తగ్గిన నీటి మట్టాలు

పట్టించుకోని అధికారులు



ఏలూరుపాడు మంచినీటి చెరువులో మట్టి తొలగింపు పనులు

ప్రజాశక్తి - కాళ్ల

నీరు అడుగంటి, నీరు రంగు మారిన చెరువులతో పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటుంటే గొంతెండిపోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. గోదావరి నుంచి పంట కాలువలకు నీటి సరఫరా వదిలి 18 రోజులు కావస్తున్నా వెంకయ్య వయ్యేరు పంట శివారు ఏలూరుపాడుకు స్వచ్ఛమైన నీరు ఇంకా రాలేదు. అన్నయ్య కోడు పంట కాలువకు కూడా మంచినీరు రాలేదు. చేపల, రొయ్యల చెరువుల కలుషిత నీరు కాలువల్లో ఉంది. ఆ నీరు దిగువకు వెళ్లే ఏర్పాట్లు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జువ్వలపాలెం, ప్రాతళ్ల మెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడీ, బోస్ కాలనీ 1, 3, మామిడిపూడి మంచినీటి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గాయి. అన్నయ్య కోడు పంట కాలువకు పూర్తి స్థాయిలో నీటిని అందించాలని పలు గ్రామాల ప్రజానీకం కోరుతున్నారు. ఏలూరుపాడు గ్రామంలో ఐదు వేలకు పైగానే జనాభా ఉన్నా ఇక్కడ తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. మంచినీటి చెరువులో నీరు తగ్గిపోవడంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా సక్రమంగా అందడం లేదు. చెరువు నుంచి నీటిని లిఫ్ట్ చేసే ఇంజన్‌కు నీరు అందకపోవడంతో మట్టిని తొలగించి పనులు చేపడుతున్నారు. దీంతో ప్రజలు కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరు రాకపోవడంతో ప్రయివేటు వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.



అడుగంటిన ఏలూరుపాడు మంచినీటి చెరువు

తక్షణ చర్యలు చేపడతాం..

అరుణా దేవి, గ్రామ కార్యదర్శి, ఏలూరుపాడు

తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే తాగునీటి చెరువు అడుగంటిన దృష్ట్యా చెరువులో ఉన్న చెత్త చెదరాలు తొలగించి పనులు చేపడుతున్నాం. చెరువులో ఆయిల్ ఇంజన్‌కు నీరు అందేలా మట్టిని తొలగించే పనులు చేపడుతున్నాం వెంకయ్య వయ్యేరు పంట కాలువలో ఉన్న నీటిని చెరువులోకి నింపే పనులు చేపడుతున్నాం. కాలువకు స్వచ్ఛమైన నీటిని అందిస్తే పూర్తిస్థాయిలో నింపేందుకు అవకాశం ఉంటుంది.

సిపిఎఫ్ కార్మికుల వంటావార్పు

సమస్య పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి - గణపవరం



సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద కార్మిక ఉద్యోగులు వంట వార్పు చేసి నిరసన

మండలంలోని సరిపల్లిలో ఉన్న సిపిఎఫ్ ఫ్యాక్టరీని తెరవాలని, కార్మికులకు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గత 11 రోజులుగా నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగ కార్మికులు వంట వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక ఉద్యోగులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం తమను అన్యాయంగా బయటికి గెంటి గేట్లకు తాళాలు వేయడం జరిగిందన్నారు. గత 11 రోజులుగా ఫ్యాక్టరీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ యాజమాన్యం, జిల్లా లేబర్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. తమ సమస్యను స్థానిక ఎంఎల్‌ఎ పచ్చమట్ల ధర్మరాజుకి తెలియజేశామని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలు పట్టించుకుని ఫ్యాక్టరీ తెరిపించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే తమకు వేతనాలు లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం తమతో చర్చలకు రాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

'అనూహ్యం'కు ప్రేక్షకుల ప్రశంసలు



బహుమతులు అందుకుంటున్న అనూహ్యం బృందం

పాలకొల్లు :విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో హర్ష క్రియేషన్స్ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య వారు ప్రదర్శించిన అనూహ్యం నాటిక 4 బహుమతులు అందుకుని ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. ఈ నాటికకు రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం కత్తుల రామ్మోహన్‌రావు, నిర్వహణ గుడాల హరిబాబు వహించారు. ఉత్తమ తృతీయ ప్రదర్శన, ఉత్తమ ద్వితీయ రచనకు తాళబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ ద్వితీయ నటుడు ఆనందరామయ్య, పాత్రధారి ఎంవి.రాజర్షి, ఉత్తమ ఆహార్యం పి.శ్రీధర్ బహుమతులు అందుకున్నారు.

నాటికలో తాళాబత్తుల వెంకటేశ్వరరావు, గుడాల హరిబాబు, మాదిరెడ్డి శ్రీనివాస్, శ్యామ్ శేఖర్, జ్యోతి రాణి, మాధవి పాత్రలు పోషించారు. సంగీతం సాయి తేజ, లైటింగ్ నాగు, సాంకేతిక సహకారం జిఎస్ఎన్.రవి, నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు, అభినందనలు తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా పల్లా నియామకంపై పలువురు హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా విశాఖపట్నం జిల్లా గాజువాక ఎంఎల్‌ఎ, పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించడం పట్ల మండలంలో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పార్టీలో సీనియర్ నాయకునిగా, మాజీ ఎంఎల్‌ఎగా, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షునిగా విలువైన సేవలు అందించిన పల్లాని వైసిపి ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందని వారు అన్నారు. ఎన్ని బాధలు పెట్టినా తట్టుకొని నిలవడమే కాకుండా, గాజువాకలో లక్ష దరిదాపు ఓట్ల మెజారిటీతో గెలిచి, పార్టీ సత్తా చూపారని వారు పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర నూతన అధ్యక్షులు పల్లా నియామకంకు హర్షం వ్యక్తం చేసిన వారిలో మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస రెడ్డి(బుల్లా), మాజీ జెడ్‌పిటిసి సత్తి సాయి ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు సంఘం అధ్యక్షులు వెలగల బుల్లి రామి రెడ్డి, మార్టేరు పిహెచ్‌సి ఛైర్మన్ కర్రి అచ్యుతరామారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి గూడూరి మురళీ మోహన్, మాజీ ఛైర్మన్ సానబోయిన గోపాల కృష్ణ, చింతపల్లి రామకృష్ణ, గుళ్లపల్లి శ్రీనివాస్, చిర్ల బాలాజీ

కాలువల ప్రక్షాళనకు మోక్షమెప్పుడో..!

పూడుకుపోయిన ప్రధాన పంట కాలువలు
నష్టాల బారిన వరి రైతులు

ప్రజాశక్తి - ఉండి

పంట కాలువలు, మురుగు కాలువలు చెత్తాచెదారాలతో నిండిపోయి, దుర్గంధం వెదజల్లుతూ పూడుకుపోయిన వాటి ప్రక్షాళన ఈ ఏడాదైనా జరుగుతుందా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి డెల్టా ప్రాంతాలైన భీమవరం రెవెన్యూ డివిజన్, నర్సాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రధాన పంట కాలువలు, మురుగు కాలువలైన మేజర్ మీడియం, మైనర్ మురుగు కాలువలు పూడుకుపోయి గత మూడు సంవత్సరాల నుంచి వరి రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తుండగా అధిక వర్షాలకు కాలువలు ముంపుకు గురై తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ప్రస్తుత వేసవికాలంలో కాలువలు, మురుగు కాలువలు ప్రక్షాళన చేయడానికి గత ఐదు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వానికి రైతులపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందని ప్రజా సంఘాల నాయకులు



గాజు సీసాలతో, చెత్తకుప్పలతో ఉండి ప్రధాన పంట కాలువ

మండిపడుతున్నారు. రైతే రాజు అని రాజకీయ నాయకులు తమ ఓట్ల కోసం పదే పదే ఊదరగొడతారు గాని ఆచరణలో రైతులకు చేసేది శూన్యం అన్నారు. పంట కాలువలు, మురుగు కాలువలలో పూడిక తీయకపోవడం వల్ల ఆకుమడి సీజన్‌లో వర్షాలు వస్తే ఆకుమల్లు ముంపుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి కేవలం గుర్రపుడెక్క, తూడు తొలగించేందుకు నిధులు కేటాయించి, కనీసం లాకులు, స్లూయిజ్‌లు, పాడైపోయిన ఛానల్ రెగ్యులేటర్ తలుపులు మరమ్మతులకు, స్లూయిజ్ తలుపులకు రంగులు వేయించేందుకు నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం రైతుల పట్ల ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందో తెలుస్తుందని విమర్శిస్తున్నారు. పంట కాలువల్లో నీరు లేకపోవడంతో చెత్తాచెదారం చేరడమే కాకుండా గాజు సీసాలు సైతం కాలువల్లోనే పారేయడంతో ఉపాధి కూలీలు కాలువ పనులు చేసేటప్పుడు గాయాలు పాలవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రేపు సత్తిరాజు సంస్మరణ సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

సత్తిరాజు సంస్మరణ సభ ఈనెల 19వ తేదీన ఆయన స్వగ్రామం పాలకొల్లు మండలం అరట్లకట్లలో జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు తెలిపారు. సత్తిరాజు తుదిశ్వాస విడిచే వరకు నిస్వార్థంగా, క్రమశిక్షణతో పార్టీ నిర్దయాల అమలుకు పనిచేశారని, గ్రామంలో పేదలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పనిచేశారని తెలిపారు. సిపిఎం నాయకులుగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోవడానికి ఈ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సంస్మరణ సభలో సభ్యులు, సానుభూతి పరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు.


సత్తిరాజు (ఫైల్ ఫోటో)



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సంసిద్ధ్ పాఠశాలలు

ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సుమారు దేశంలో 22 బ్రాంచిలకుపైగా సంసిద్ధ్ పాఠశాలలను నెలకొల్పడం జరిగిందని సంసిద్ధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పాలకొల్లు రోడ్డులోని సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాల్లో నూటికి నూరు శాతం సాధించిన సందర్భంగా సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ మెట్ల సురేష్ ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంసిద్ధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. సిబిఎస్ఇ ఐదుసార్లు నూటికినూరు శాతం ఫలితాలు సాధించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన బోధనా పద్ధతులను ప్రవేశ పెట్టడం చాలా గొప్ప విషయం అని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేత దుర్మార్గం

పోలీసులకు ఫిర్యాదు : టిడిపి ఎస్‌సి సెల్ సభ్యుడు ఆశీర్వాదం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ టిడిపికి చెందిన కొంతమంది వ్యక్తులు వేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేసిన సంఘటన ఉండి మండలం చినపుల్లేరు గ్రామ శివారు తల్లమ్మ చెరువులో చోటుచేసుకుంది. బాధితుడు టిడిపి మండల ఎస్‌సి సెల్ సభ్యుడు గొల్ల ఆశీర్వాదం అందించిన వివరాల ప్రకారం ఈనెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని తల్లమ్మ చెరువు గ్రామంలో గొల్ల ఆశీర్వాదం, మరి కొంతమంది టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి పెదపుల్లేరు - తల్లమ్మ చెరువు రహదారి పక్కన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఇతర నాయకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ ఫ్లెక్సీలను ఈనెల 17వ తేదీన ఉదయం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చించివేసినట్లు ఉదయం 6 గంటలకు తమ దృష్టికి రాగా వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించడం జరిగిందని, కొంతమంది వ్యక్తులు కావాలని ఈ ఫ్లెక్సీలను చించివేశారని, వారికి తమ మీద కోపం ఉంటే తమ మీద చూపించాలి కాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తదితరులున్న ఫ్లెక్సీలను చించివేయడం ఏంటని వారు ప్రశ్నించారు. గ్రామంలో ఇటువంటి చర్యలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. సోమవారం మధ్యాహ్నం ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు న్యాయం చేయని యెడల పార్టీ నాయకులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలియజేశారు. రెండు రోజుల క్రితం ఎన్ఆర్‌పి అగ్రహారం మండల సర్పంచ్, ఉండి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని మెయిన్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన టిడిపి నాయకుల ఫ్లెక్సీలను కూడా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం జరిగిందని, దళితులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మాత్రమే చించివేతకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


చించేసిన ఫ్లెక్సీ

పోలవరం ప్రాజెక్ట్ చంద్రబాబు పూర్తి చేస్తారు

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

పెనుమంట్ర:రెండు మూడు శతాబ్దాలుగా ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చినప్పటి నుంచి ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించిన ఘనత చంద్రబాబుదేనని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గత చంద్రబాబు పాలనలో శరవేగంగా ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టాయని, ఆయితే తర్వాత వచ్చిన గత విధ్వంస పాలనలో పోలవరం ప్రాజెక్టు నత్తనడకన సాగడంతో పాటు కాపర్ డాం కొట్టుకుపోయిన సంఘటనలు ఆంధ్రులు మర్చిపోరని అన్నారు. అసమర్థుడికి పాలన అందిస్తే ఐదేళ్ల పాలనలో విధ్వంసాలు, అరాచకాలు, అవినీతి రాజ్యమేలిందన్నారు. ప్రజలు అరాచక పాలనకు స్వస్తి పలికి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేస్తారని తెలియజేశారు.


దాతల సహకారంతో గ్రామాలాభివృద్ధి సాధ్యం

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామానికి మేలు చేయాలన్న సంకల్పంతో అనేక మంది దాతలు ముందుకు వస్తే, గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలకు దాతల సహకారం ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. వేంపాడు గ్రామంలో వేగేశ్న కాశీ విశ్వేశ్వరరాజు(అభిరుచి కాశీరాజు) 61వ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత వేంపాడు గ్రామంలో వేగులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అభిరుచి కాశీ పుట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. 300 మంది వృద్ధులకు అభిరుచి కాశీరాజు ఆర్థిక సహాయంతో తీసుకువచ్చిన దుప్పట్లను ఎంఎల్ఎ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ అభిరుచి కాశీ రాజు పుట్టినరోజు వేడుకల్లో పేదలకు దుస్తుల పంపిణీ అభినందనీయమన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. అభిరుచి కాశీరాజు గ్రామాభివృద్ధి కోసం అనేకసార్లు తనతో మాట్లాడటం జరిగిందన్నారు. ఆయన అనుకున్న అభివృద్ధి కార్యక్రమాలు జరగడానికి కొంత సమయం పడుతుందన్నారు. దాత సహకారంతో అభివృద్ధి చేసేందుకు ఒక ప్రణాళికను రూపొందిస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడనని, ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరానన్నారు. ప్రతి గ్రామం నుంచి కొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ఎంఎల్ఎను గ్రామస్తులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపాడు ఉప సర్పంచి వేగేశ్న సుమన్, డాక్టర్ వేగేశ్న రామకృష్ణంరాజు, రవికుమార్ రాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరావు, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, యిర్రింకి శ్రీనివాసరావు, వి.పుల్లంరాజు, కోటి పాండు రంగారావు, అరేటి వెంకట రత్నప్రసాద్, వివిధ గ్రామాల నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు: యిర్రింకి శ్రీనివాసరావు భార్య యిర్రింకి పద్మావతి గ్రామ సర్పంచిగా పని చేస్తున్నారు. వైసిపి నాయకుడు యిర్రింకి శ్రీనివాసరావు ఎంఎల్ఎ రఘు రామకృష్ణంరాజు సమక్షంలో టిడిపిలోకి చేరారు.


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

పలుచోట్ల ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి - పెనుగొండ


సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ అని ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. స్థానిక వంతున వీధి వద్ద గల మసీదులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మీరా సాహెబ్ మాట్లాడుతూ ప్రతి సోదరుడు దైవాజ్ఞ ప్రకారం తోటి సోదరులతో స్నేహం, ప్రేమ పెంపొందించుకుని అల్లాపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగి, ఎదుటి వారికి సహాయం చేయాలని, సేవాభావం కలిగి ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యులు చోటా బాబు మాట్లాడుతూ మానవుడు సంఘజీవని, ప్రవక్త ఆచరణ ప్రకారం మానవుల మధ్య సంబంధాలు పెంపొందించుకోవాలని, అందరితోని స్నేహం, ప్రేమతో మెలగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ బాషా, షేక్ రెహమాన్, షేక్ బాబు సుభాని, షేక్ రంజాన్, షేక్ బాజా, మల్లా షాకీర్, షేక్ మీరా, షరీఫ్, సయ్యద్ బాజీ, షేక్ కాజా ఇతర గ్రామాల నుంచి చెరుకువాడ, ఏలేటిపాడు, అయినపర్రు, వడలి, రామన్నపాలెం ముస్లీం సోదరులు అత్యధికంగా పాల్గొన్నారు.


మొగల్తూరు: బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని ముస్లీం గురువు హాఫీజ్ మహమ్మద్ సాబాజ్ అన్నారు. సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ అలీ, బాబాజి సాహెబ్, డాక్టర్ సలీమ్, సూర్జాహాన్, పరవాజ్, షరీఫ్, సుభాన్, అమీరా బాషా ఉన్నారు.


పెనుమంట్ర : సమస్త మానవాళి శాంతి, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అల్లాను కోరుకుంటూ ముస్లిం ప్రతినిధులు ఈద్ దువా చేశారు. సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా మండలంలోని మార్టేరు జామియా నూర్ మసీద్‌లో పలువురు ముస్లిం సోదరులు ఉదయం నుంచి నమాజ్ చదువుతూ పర్వదిన వేడుకలు నిర్వహించుకున్నారు. బక్రీద్‌ని ఉద్దేశిస్తూ మసీదు గురువు షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకగా ఈ బక్రీద్ పండుగ చేసుకోవడం జరుగుతుందని, సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని హిందూ ముస్లిం సోదర భావనతో మెలగాలని, అన్ని గ్రామాల్లోని ప్రజలందరూ బాగుండాలని వారు ఈద్ దువా చేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ గౌస్ మొహుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్బాస్, సెక్రెటరీ షేక్ బాబ్జి, జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా, మసీదు ట్రెజరరీ ఎండి ముక్తార్జ, జనసేన నాయకుడు షేక్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

నరసాపురం: ముస్లిం సోదరులు ఎంతో ఘనంగా జరుపుకునే బక్రీద్ పండుగా ప్రార్థనలు సోమవారం పట్టణంలో మిషన్ హై స్కూల్ రోడ్డులోని ఈద్గాలో నిర్వహించారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు ముస్లిం సోదరులు స్వాగతం పలికారు. ఈద్గాలో ఏర్పాటు చేసిన నమాజులో నాయకర్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మికో ఉపన్యాసం చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారన్నారు. త్యాగనీరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. ధనిక, పేద తారతమ్యం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా మైనారిటీలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.

తణుకు: బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం తణుకు పట్టణంలోని ఈద్గాలో నమాజ్‌లో నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొని ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. తణుకు పట్టణం వేల్పూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ షాపుని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మరో నూతన ఎంపైర్ ఎలక్ట్రికల్ వాహన షాపుని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.


తణుకు : ప్రత్యేక ప్రార్థనలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ


నరసాపురం: ఆలింగనం చేసుకున్న నాయకర్


మొగల్తూరులో..


పెనుమంట్రలో..


పెనుగొండలో..

పంట పొలాల్లో నీరు.. జోరుగా బాతుల పెంపకం

కుటుంబాలతో వలస బాట పట్టిన పెంపకందారులు


పొలంలో పెట్టిన నీళ్లలో బాతుల గుంపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వా వరి సీజన్ మొదలు అవుతున్న వేళ పొలాలను దమ్ము చేసుకోవడానికి పెట్టిన నీళ్లలో తమ బాతుల మందను పెంచి, పోషించుకోడానికి పెంపకం దారులు చిన్న చిన్న వాహనాల్లో బాతులతో వచ్చిన దృశ్యాలు అనేక పొలాల వద్ద కనిపిస్తున్నాయి. ఏలూరు మండలం పోతునూరు గ్రామం నుంచి వచ్చిన పొలమేటి వలస నాగరాజు తండ్రి, భార్య, కూతురుతో కలిసి ఆలమూరు -పెనుమంట్ర రోడ్డు పక్కన మకాం టెంటు వేసుకొని, తమ బాతుల మందను పొలాల్లోకి వదిలి, కాపలా కాస్తున్నారు. వీరే కాక ఇలాంటి కుటుంబాలు మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాల దగ్గర్లో మకాం వేసుకొని, నీరు పెట్టిన పొలాల్లోకి బాతుల మందలను వదులు తున్నారు.

ఇది బాతులు గుడ్లు పెట్టే కాలం

తొలకరి వర్షాలు ప్రారంభం అయితే బాతులు గుడ్లు పెట్టడానికి సిద్ధం అవుతాయని బాతుల పెంపకం దారుడు పొలిమేటి వలస సింహాచలం అన్నారు. వరి కోసిన పొలాల్లో వర్షం కురిసిన నీళ్లలో, దమ్ముకోసం నీరు పెట్టిన సమయంలో, భూమిలో ఉన్న లద్ది పురుగులు చల్లదానానికి బయటకు వస్తాయని చెప్పారు. పంటకు హాని చేసే లద్ది, తదితర పురుగులను బాతులు ఇష్టంగా తింటాయని, అలా బలమైన ఆహారం తీసుకొని గుడ్లు పెడతాయన్నారు. ఆ గుడ్లను అమ్ముకోవడం ద్వారా తమ జీవనాన్ని గడుపు కుంటామని, తరతరాలుగా ఇదే ఆధారమని తెలిపారు.


వలస వచ్చిన బాతుల పెంపకందారులు

ఎంపిపి ఛాంబర్‌లో జగన్ ఫొటో తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - నరసాపురం

'ఎంపిపి చాంబర్‌లో జగన్ ఫొటో' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈనెల 17వ తేదీన ఎంపిపి ఛాంబర్‌లో జగన్ ఫొటో అనే కథనం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ సందర్భంగా సోమవారం నరసాపురం ఎంపిడిఒ ఎవి.రమణారావు స్పందించి ఫొటో తొలగించారు.


ఆలింగనం చేసుకున్న అంజిబాబు, వర్మ

భీమవరం అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం

కేంద్ర సహాయ మంత్రిని సత్కరించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం అభివృద్ధికి ఇద్దరం కలిసి పాటుపడతామని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. నరసాపురం బిజెపి ఎంపీ, కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసంలో అంజిబాబు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. ఇద్దరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై, అనుసరించాల్సిన వ్యూహాలపై కొద్ది సమయం చర్చించారు.


శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మాణిక్యాలరావు

కేన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

లయన్స్ గవర్నర్ మాణిక్యాలరావు

ప్రజాశక్తి - ఉండి

కేన్సర్ పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. సోమవారం ఉండి లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత ఎఎంసి మాజీ ఛైర్మన్, లయన్స్ సాగిరాజు సాంబశివరాజు దాతృత్వంతో ఉచిత రొమ్ము కేన్సర్ పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షురాలు వేగేశ్న అనంత లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాణిక్యాలరావు మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్ పరీక్ష ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్‌ను అభినందించారు. జిల్లా గవర్నర్, ఏరియా రిప్రజెంటివ్ మాదిరెడ్డి కృష్ణ కుమారి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం కన్నెగంటి రూత్ కళ, రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, మణిపాల్ ఆసుపత్రి శిబిరం కో ఆర్డినేటర్ వినోద్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సత్తి బ్రహ్మారెడ్డి, భూపతిరాజు హరనాథ్ రాజు, పాలతీర్థపు నరసింగరావు, గాదిరాజు వెంకటేశ్వర రాజు, కాగిత మహంకాళి, బొండాడ కేశవరావు, గొట్టుముక్కల రాము మణిపాల్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది రోగులకు రొమ్ము కేన్సర్, అండాశయం కేన్సర్ తదితర కేన్సర్‌లకు పరీక్షలు నిర్వహించారు.

నిర్వాసితుల పునరావాస సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


పోలవరం నిర్వాసితుల పునరావాస తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. మూడు రోజులపాటు స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన రాష్ట్ర మహాసభ చివరి రోజు సోమవారం పలు తీర్మానాలు ఆమోదించడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన లక్షలాది మంది గిరిజన, గిరిజనేతర పేద ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. మొదటి ప్రాధాన్యతగా నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, పునరావాస సమస్యలను పూర్తిగా పరిష్కరించాకే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పునరావాసం నిర్వాసితులకు భిక్ష కాదని, అది ప్రజాస్వామిక హక్కు' అని, దానిని సాధించుకోవడానికి అంతా ఐక్యంగా పోరాడాలన్నారు. పలువురు నేతలు సభలో మాట్లాడారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతానికి తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం 28వ వార్డులోని గరువు రోడ్‌లో విద్యుత్ ఘాతానికి తాటాకు ఇల్లు దగ్ధమైంది. దీనికి సంబంధించి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.భాస్కర్ రామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లి దేశంగరాజుకు చెందిన తాటకిల్లు షార్ట్ సర్క్యూట్‌కి గురై దగ్ధమైందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.75 లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు. స్థానికులు, ఫైర్ స్టేషన్‌కు సంబంధించిన సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.


దగ్ధమవుతున్న తాటాకిల్లు